# వెల్లడవుతున్న మోడీ పథకాల అసలు లక్ష్యం

**మోడీ** నాయకత్వంలో బిజెపి కేంద్రంలో అధికారం లోకొచ్చి మూడు సం॥లు దాటింది. స్వచ్ఛభారత్‌తో ప్రారంభించి మోడీ ఈ మూడేళ్ళ కాలంలో పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టిదాకా పలు పథకాలను అమలులోకి తెచ్చాడు. ఈ పథకాల గురించి 'జనశక్తి' వివిధ సందర్భాలలో వ్యాఖ్యానించింది. ప్రతి పథకం వెనుక బహిరంగంగా ప్రకటించిన లక్ష్యాలను మించిన నిగూఢ ప్రయోజనముంది. ఈ లక్ష్యాలు ఎంతమేరకు సాధించ బడ్డాయో ఒక్కసారి పరిశీలిద్దాం.

**స్వచ్ఛభారత్ పథకం**

పరిశుభ్ర నివాస స్థలాలను సృష్టించుకోవటమే స్వచ్ఛభారత్ పథకం యొక్క లక్ష్యంగా వుంది. బహిరంగ మలవిసర్జనరహిత దేశంగా తీర్చిదిద్దటమే దీనికి ప్రాతిపదిక. అధికార రాజకీయ నేతలు చీపుర్లు పట్టి ఊడుస్తున్నట్లుగా ప్రచారంగావించుకుంటూ, తాము చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజలలో చైతన్యం కలిగిస్తుందని చెపుతున్నారు. స్థానిక స్థాయిల్లో జరిగే ఈ తంతును ఎన్‌డిఏ ప్రభుత్వం జాతీయ కార్యక్రమం చేసింది. నిర్మల్ భారత్ అభియాన్ పేరిట గతంలో ఇలాంటి కార్యక్రమం ఒకటి అమలైంది. రాష్ట్ర ప్రభుత్వాలు తాము నిర్మించిన మరుగుదొడ్ల సంఖ్యను ఎక్కువజేసి చూపుతున్నాయని 'కాగ్' తనిఖీలో వెల్లడైంది. స్వచ్ఛభారత్ కార్యక్రమం కూడా అదే దోవన సాగుతోంది.

స్వచ్ఛభారత్ ప్రకటించిన నాటినుండి నిర్ణయించిన లక్ష్యాలను అధిగమిస్తూ వస్తున్నామని తాగునీరు, పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ ప్రకటించుకుంది. 2014-15 సం॥లో తమ ప్రకటిత లక్ష్యమైన 1 కోటీ 20 లక్షల మరుగుదొడ్లకుగాను 1 కోటీ 27 లక్షల మరుగుదొడ్లు నిర్మించామన్నారు. 2016-17లో కూడా 1 కోటీ 15 లక్షల మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యంకాగా, 2 కోట్ల 17 లక్షల మరుగుదొడ్లు పూర్తిచేశామని గొప్పగా చెప్పుకుంటున్నారు. వారు చెబుతున్న గణాంకాల ప్రకారం ఇప్పటిదాకా నిర్మాణమైన మరుగుదొడ్ల సంఖ్య 4 కోట్ల 96 లక్షలుగా వుంది.

స్వచ్ఛభారత్ పథకం యొక్క బడ్జెట్ కేటాయింపులో మరుగుదొడ్ల నిర్మాణం, మరియు ఈ కార్యక్రమ సమాచార, వార్తాప్రసారాల ఖర్చులన్నీ కలిసే వుంటాయి. 2014-15లో తాగునీరు-పారిశుద్ధ్య-మంత్రిత్వశాఖకు బడ్జెట్ కేటాయింపులు రూ. 2850 కోట్లు. మరుగుదొడ్ల నిర్మాణంలో కేంద్రప్రభుత్వ వాటాగా రూ. 7200 చొప్పున, బడ్జెట్ మొత్తాన్ని మరుగుదొడ్ల నిర్మాణానికే వెచ్చించారనుకుంటే కూడా 39 లక్షల 50 వేల మరుగుదొడ్లు మాత్రమే నిర్మించగలుగుతారు. తాగునీరు-పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ 58 లక్షల 50 వేల మరుగుదొడ్లను నిర్మించామంటోంది. అంటే రూ. 4,215 కోట్లు వెచ్చించి వుండాలి. ఈ రెండింటి తేడా రూ. 1365 కోట్లను తరువాత సం॥ బడ్జెట్ పద్దులో కూడా చూపలేదు.

2015-16 సం॥లో కూడా జరిగింది ఇదే కథ! బడ్జెట్ కేటాయింపు రూ. 6524 కోట్లను మరుగుదొడ్ల నిర్మాణానికి వెచ్చించారనుకున్నా, 96 లక్షల మరుగుదొడ్లను మాత్రమే నిర్మించగలుగుతారు. అయితే తాగునీరు - పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ ఈ నిధులతో 1 కోటీ 20 లక్షల దొడ్లు నిర్మాణం చేశామని తమకు తామే కితాబిచ్చు కుంటోంది.

దీనిలో గృహయజమానులు స్వంతంగా నిర్మించుకున్న మరుగుదొడ్లతోపాటు, గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి ఇతర పథకాల క్రింద నిర్మాణమైనవి కూడా తోడవటం, ఈ నిర్మాణాల సంఖ్యలో తేడాలకు కారణమనే కొన్ని వివరణలు ప్రచారంలో వున్నాయి. ఈ సంజాయిషీలన్నీ మరుగుదొడ్ల నిర్మాణాల సంఖ్యను అధికం చేసి చూపారనేదాన్ని నిర్ధారిస్తున్నాయి.

తాగునీరు - పారిశుద్ధ్యశాఖ ప్రకటించుకున్నవిధంగా ఈ నాలుగు సంవత్సరాలలో 4 కోట్ల 90 లక్షల మరుగుదొడ్లను నిర్మాణం చేసి వుంటుందనుకుంటే కూడా, ఇంకా నిండుగా ఒక్క సం॥రం కాలం మాత్రమే మిగిలివుండగా 5 సం॥ల కాలంలో నిర్మాణ లక్ష్యమైన 11 కోట్ల 11 లక్షలను ఎలా చేరుకుంటుంది? మిగిలిన 6 కోట్ల 20 లక్షల నిర్మాణాలను ఈ సం॥ కాలంలో పూర్తిచేయటం ఎలా సాధ్యమౌతుంది?

స్వదేశీ మంత్రాన్ని పారాయణచేసే మోడీ మానస పథకమైన స్వచ్ఛభారత్‌కు ప్రపంచబ్యాంకు నిధులు సమకూరుస్తోంది. స్వచ్ఛభారత్ పథకం యొక్క అమలు తీరును మదింపుచేసే ఓ తటస్థ అంతర్జాతీయ స్థాయి శాఖను నెలకొల్పటంలో ప్రభుత్వ వైఫల్యం కారణంగా ప్రపంచబ్యాంకు కేటాయించిన 450 కోట్ల డాలర్లు పంపిణీ జరగలేదు. ఏమైనా, 2015 డిసెంబర్ నుండి ఈ కేటాయింపు మొత్తంపై 0.5 శాతం వడ్డీని ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ విధంగా బహిరంగ మలవిసర్జనరహిత లక్ష్యం సుదూరంగా నెరవేరకుండా వుంది.

స్వచ్ఛభారత్ పథకం యొక్క మరో అంశమైన గ్రామాలు, పట్టణాలు, నగరాలలో పరిసరాలను శుభ్రంగా వుంచుకోవాలనే లక్ష్యం ఎక్కడవరకు అమలైంది? ఈ బాధ్యతను ప్రధానంగా నిర్వహించవలసిన స్థానిక పౌర సంస్థలైన పంచాయితీలు, మునిసిపాలిటీలు,

నిధుల కొరతతో తమ విధులను నిర్వహించలేకపోతున్నాయి. దీనికి కారణమేమంటే, స్థానిక సంస్థలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలనే రాజ్యాంగ నిబంధనను వరుసగా అధికారంలోకి వస్తున్న పార్టీలన్నీ లక్ష్యపెట్టటంలేదు. కనీసం స్థానిక సంస్థలకు అవసరమైన నిధులను కూడా కేటాయించటంలేదు. ఇది సాధించబడితే, స్థానిక సంస్థలు పారిశుద్ధ్య కార్యక్రమాలను, రక్షిత మంచినీటిని సక్రమంగా అందించగలుగుతాయి. తద్వారా భారతదేశంలో సంక్రమిత వ్యాధులు దాదాపు అరికట్టబడతాయి.

**జన్‌ధన్‌యోజన**

నియత ఆర్థికవ్యవస్థ పరిధిలోకి యావత్తు సమాజాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి జన్‌ధన్‌యోజన (పిఎంజెవై) పథకాన్ని ప్రకటించారు. 2017 ఆగస్టునాటికి పిఎంజెవై క్రిందనున్న బ్యాంకు ఖాతాల సంఖ్య 22 కోట్ల 70 లక్షలు కాగా, ఈ ఖాతాలలో వున్న మొత్తం డబ్బు 65,844 కోట్ల రూ. ఇప్పటికే ఖాతాలను ప్రారంభించే లక్ష్యం నెరవేరింది.

నిరర్థక ఆస్తులు పెరిగిపోతూ డబ్బుకోసం నకనక లాడుతున్న బ్యాంకులు ఈ ఖాతాల నిల్వలలోని కనీసం 50 వేల కోట్ల రూ॥లను తమ వ్యాపారానికి ఉపయోగించు కున్నాయి. అలాగే, వడ్డీరేట్లలో కోతలకు దోవతీసిన పెద్దనోట్ల రద్దు కారణంగా వున్న నిల్వలు తోడయ్యాయి.

అయితే బ్యాంకుల నుండి ఈ అడ్వాన్సులను తీసుకున్నదెవరు? అది కూడా బడా వ్యాపారవర్గమే. 2014-15 ఆర్థిక సం॥లో చిన్న, సూక్ష్మ స్థాయి పరిశ్రమలకు అందించిన ఆర్థిక తోడ్పాటు 13.3 శాతముండగా, ఈ సంవత్సరం 12.6 శాతానికి పడిపోయింది. ప్రతి పిఎంజెవై ఖాతాదారుడూ తన ఖాతాలో వున్న మొత్తానికి మించి రూ. 5000 తీసుకునేందుకు అర్హుడని చెప్పినా అది ఎక్కడా అమలుకాలేదు.

బ్యాంకులు చెబుతున్న కథనం ప్రకారం, పిఎంజెవై ఖాతాలలో కేవలం 15 శాతం మాత్రమే పరపతి ఖాతాలుగా అనుసంధానం చేయబడగా, మిగిలిన 85 శాతం ఖాతాలు పరపతి అర్హత లేనివిగా వున్నాయి. పరపతి అనుసంధానమైన ఆ 15 శాతం ఖాతాలకైనా రుణాలు ఇచ్చారా అంటే అదీ లేదు. పిఎంజెవై ఖాతాదారులు తమ అవసరాలన్నింటికీ అనివార్యంగా ఫైనాన్స్ వ్యాపారులు, మైక్రోఫైనాన్స్ (సూక్ష్మరుణ సంస్థలు)లపై ఆధారపడవలసి వస్తోంది.

పెద్దనోట్ల రద్దు తర్వాత బ్యాంకింగ్ మార్గాలలోకి నల్లధనాన్ని తరలించటానికి పిఎంజెవై ఖాతాలను ఉపయోగించారనేది తప్పుడు అభిప్రాయం. అధికారిక సమాచారం దీనితో సరిపోలటంలేదు. పెద్దనోట్ల రద్దు తర్వాత పిఎంజెవై ఖాతాలలో నిల్వలు 74 వేల కోట్ల రూ॥కు చేరుకున్నాయి. అంటే సగటున ప్రతి ఖాతా నిల్వ 8,500 రూ॥ మాత్రమే. 2017 ఆగస్టునాటికి ఈ ఖాతాలలో నిల్వ 65,695 కోట్ల రూ. అంటే, 8 నెలల కాలంలో 8,300 కోట్ల రూ॥ల నగదు బ్యాంకుల నుండి విత్‌డ్రా చేశారన్నమాట. భారీ అంకెల పెద్దనోట్ల రద్దు మొత్తాలతో పోల్చినపుడు ఇది చాలా స్వల్పం.

పిఎంజెవైకు అనుసంధానించబడిన ఇతర ఆర్థిక పథకాలున్నాయి. 30 వేల రూ॥ల జీవితబీమా వర్తించే 29 కోట్ల 40 లక్షల ఖాతాలలో 4,784 క్లెయిమ్ చేసుకోగా, 2017 ఆగస్టు 8 నాటికి వీనిలో 4,801 ఖాతాలకే చెల్లింపులు జరిగాయి. ఇది మూడు సం॥లకు మాత్రమే. జీవితబీమా పాలసీల మొత్తం కేసులలో వారికి అందిన క్లెయిము సగటుకంటే ఇది చాలా తక్కువ. ఇక లక్ష రూ॥ల ప్రమాదబీమా క్లెయిములు 2,576 కాగా, పరిష్కరించబడిన క్లెయిములు 1817 మాత్రమే.

ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన (పిఎంజెజెబివై), ప్రధానమంత్రి సురక్షబీమా యోజన (పిఎంఎస్‌బివై), అనే ఇతర ఆర్థిక పథకాలూ వున్నాయి. పిఎంజెజెబివై క్రింద మొత్తంగా నమోదైన సంఖ్య 3 కోట్ల 46 లక్షలు కాగా, 68,681 మాత్రమే క్లెయిమ్ చేసుకున్నవి. పిఎంఎస్‌బివైలో మొత్తం నమోదైన సంఖ్య 10 కోట్ల 90 లక్షలుకాగా, 2017 ఆగస్టునాటికి పరిష్కరించబడిన క్లెయిములు 15,420 మాత్రమే. సంబంధిత శాఖలు అందజేసిన ఈ సమాచారాన్ని వారే ఇంకా పరిశీలించుకోవలసి వుంది.

చిన్న పరిశ్రమలకు రుణాలు అందజేసే లక్ష్యంతో రూపకల్పన చేసిన 'ప్రధానమంత్రి ముద్ర యోజన'లో నాలుగు లక్షల ఖాతాలుండగా, ఈ మొత్తం ఖాతాలకు కలిపి 1 లక్షా 80 వేలకోట్ల రూ॥, అనగా ఒక్కో ఖాతాకు 45,000 రూ॥ స్వల్ప మొత్తం మాత్రమే రుణాలిచ్చారు. మహాద్భుత విజయంగా, లక్షలమంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్న పథకంగా మోడీ కొనియాడుతున్న పథకం పరిస్థితి ఇలా వుంది.

పిఎంజెవై మూడు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ పథకం 'లక్షలాది ఆకాంక్షలకు రెక్కలు నిచ్చింద'ని మోడీ పేర్కొన్నాడు. కానీ వాస్తవ అర్థంలో ఆ రెక్కలను కత్తిరించివేసింది. మీదుమిక్కిలి, మన సమాజంలో నిరుపేదలకు కేటాయించబడిన సబ్సిడీలలో కోతలు విధించి పిఎంజెవై ఖాతాలలో ఉపయోగించటం జరుగుతోంది. అవినీతి నిరోధం పేరున, అర్హులైనవారికే సదుపాయాలందాలనే పేరున ప్రజా పంపిణీ వ్యవస్థలోనున్న రేషన్ షాపులను మూసివేసి, లబ్ధిదారుల ఖాతాలలో ఆ సబ్సిడీ మొత్తాన్ని జమచేస్తామని చెబుతున్నారు. ప్రత్యక్ష ఫలిత బదలాయింపు వ్యవస్థ అంటే ప్రజలను డబ్బును తినమనటమే.

**మేక్ ఇన్ ఇండియా (భారత్‌లో తయారీ)**

ప్రపంచ ఉత్పత్తి స్థావరంగా భారతదేశాన్ని మలచాలనే ప్రకటిత లక్ష్యంతో ఎన్‌డిఏ ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించింది. తదను గుణంగా విదేశీ ద్రవ్యపెట్టుబడిని ఈ దేశంలోకి రమ్మని, ఇక్కడ తయారీచేసి ప్రపంచ దేశాలలో అమ్ముకోమని మోడీ పిలుపునిచ్చాడు.

ఈ పథకం క్రింద, భారత పెట్టుబడిదారులతో మిలాఖత్తు అయి, యుద్ధవిమానాలు, జలాంతర్గాములతో సహా అధునాతన ఆయుధాలు, సైనిక హార్డ్‌వేర్‌లను బహుళజాతి కంపెనీలు ఈ దేశంలో ఉత్పత్తి చేస్తాయని ఎన్‌డిఏ ప్రభుత్వం ఆశించింది. అనేకమంది ఆయుధ ఉత్పత్తిదారులు ఆసక్తి కనబరచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ప్రవేశానికున్న నిబంధనలను సరళతరం చేయాలని డిమాండ్ చేశారు. ఆయుధ తయారీలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితిని 49 శాతానికి, కొంతకాలం తర్వాత 76 శాతందాకా సడలింపు ఇవ్వటానికి, ఎఫ్‌డిఐని ఆకర్షించేందుకు అవసరమైతే 100 శాతం సడలింపు నివ్వటానికి కూడా ప్రభుత్వం సిద్ధమైంది.

ఆయుధాలు, ఆయుధ సామాగ్రికి అతిపెద్ద కొనుగోలుదారులలో ఒకటిగా భారతదేశం వుండటాన, బహుళజాతి కంపెనీలు అసెంబ్లింగ్ (విడి భాగాలను కూర్పుచేసే) పరిశ్రమలను నిర్మించటానికి సిద్ధంగా వున్నాయి. భారతదేశం కనీసం వంద యుద్ధ విమానాల కొనుగోలుకు అంగీకరిస్తే లోక్‌హీడ్ మార్టిన్ తన ఎఫ్-16 యుద్ధ విమానాల ఉత్పత్తి విభాగాన్ని టెక్సాస్ - ఫోర్టువర్త్ నుండి భారతదేశం తరలిస్తామని, దీనిని తమ ఏకైక ప్రపంచవ్యాపిత పరిశ్రమగా మలుస్తామని ప్రకటించింది. అది - టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌ను తన భారతదేశ భాగస్వామిగా ఎంచుకుంది. సాంకేతిక పరిజ్ఞానంపై తన అదుపును కలిగివుండేందుకు అమెరికా కంపెనీ గ్యారంటీ అడుగుతోంది. సాంకేతికతను బదలాయించటానికి వారు సిద్ధంగా లేరు. సాంకేతికత బదలాయించకుంటే, భారతదేశం ఎప్పటికీ ఆయుధ కొనుగోలుదారుగానే మిగిలిపోతుంది. ప్రపంచ ఉత్పత్తి స్థావరంగా ఆవిర్భవిస్తుందన్న మోడీ ప్రకటనలకు భిన్నంగా బహుళజాతి కంపెనీల 'ద్వితీయ అసెంబ్లీ లైన్ మేనేజర్'గా భారతదేశం మిగిలిపోనుంది.

మేక్‌ఇన్ ఇండియాలో ఇతర విభాగాల గురించిన సమాచారం సంపూర్ణంగా లేకపోగా, పూర్తి సమగ్రరూపంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి గణాంకాలు ఇవ్వకపోవటం వలన గందరగోళం కల్పించేదిగా వుంది. ఏమైనా, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి భారత పరిశ్రమలను అప్పగించి, భారత పెట్టుబడిని బహుళజాతి కంపెనీల జూనియర్ భాగస్వామిగా ముడిపెట్టనుంది.

ooooo